ఒంటరి మహిళలే టార్గెట్

- మధ్యప్రదేశ్ నుంచి వచ్చి రాష్ట్రంలో దొంగతనాలు
- చివరకు పోలీసులకు చిక్కిన నిందితుడు
- వివరాలు వెల్లడించిన ఏసీపీ తిరుపతి

కాశీబుగ్గ: నిందితుడిని అరెస్టు చేసి వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ తిరుపతి

కాశీబుగ్గ, డిసెంబర్ 19: మధ్యప్రదేశ్ నుంచి వచ్చిన వ్యక్తి ఇంటరి మహిళలను టార్గెట్ చేసుకొని దొంగతనాలకు పాల్పడుతున్నాడు. ఈ క్రమంలో ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు. వరంగల్ 14వ డివిజన్ ఇందిరమ్మకాలనీ ఫేజ్-2లో ఈ నెల 10న పుస్తెలతాడును దొంగిలించిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు మామునూరు ఏసీపీ తిరుపతి తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఇందిరమ్మకాలనీ ఫేజ్-2లో మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన హుకుం సింగ్‌లోది క్యాలిక్యులేటర్లు రిపేర్ చేసే నేపంలో షాపులు, కిరాణాల్లో రెక్కీ నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో ఒంటరిగా ఉన్న మహిళలను టార్గెట్ చేసి చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్నాడు. రెండు నెలల క్రితం సిద్దిపేటలో అద్దెకు ఇల్లు కావాలనే నెపంతో ఇంట్లో ఒంటరిగా ఉన్న వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును తెంచుకొని పారిపోయాడు. ఈ నెల 10న మధ్యాహ్నం ఇందిరమ్మకాలనీ ఫేజ్-2లో కిరాణం నిర్వహిస్తున్న కొండపర్తి సుమలతను సిగరెట్ కావాలని అడిగాడు. చిల్లర ఇచ్చే క్రమంలో మహిళ ముఖంపై కారం చల్లి మెడలోని పుస్తెలతాడును తీసుకొని పారిపోయాడు. బుధవారం హుకుంసింగ్ లోదిని ఎనుమాముల పోలీసులు చాకచక్యంగా పట్టుకునారు. అతడి నుంచి రెండు నర్ల తులాల పుస్తెలతాడును స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ వెల్లడించారు. నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ చూపిన సీఐ ఆలె రాఘవేందర్, ఎస్సై పోగుల శ్రీకాంత్, సిబ్బందిని అభినందించారు.

గీసుగొండలో మరొకరు..

గీసుగొండ: రెండు నెలల క్రితం వరంగల్ 16వ డివిజన్ గొర్రెకుంట కట్టమల్లన్న ఆలయ ప్రాంగణంలోని రేణుకా ఎల్లమ్మ గుడిలో దొంగతనం చేసిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ మహేందర్ తెలిపారు. హనుమకొండ జిల్లా కమలాపురం మండలం వంగపల్లికి చెందిన కొలిపాక రాజు (సొల్లు రాజు) రాత్రి వేళల్లో నిర్మానుష్యంగా ఉన్న ఆలయాలను టార్గెట్ చేసుకొని దొంగతనాలు చేస్తున్నాడు. రెండు నెలల క్రితం రేణుకా ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారి బంగారు ముక్కుపుల్ల, ముక్కుపోగు, వెండి ముక్కుపుడక, చంద్రవంక, వెండి చేతి కడియాలను ఎత్తుకెళ్లాడు. అర్బకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా, గురువారం ఊకల్ క్రాస్‌రోడ్డులో బైక్‌పై వెళ్తున్న రాజును పట్టుకొని విచారించగా, తానే దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడని చెప్పారు. సొత్తును రికవరీ చేసినట్లు సీఐ తెలిపారు.

అమిత్‌షా వ్యాఖ్యలపై నిరసనల వెల్లువ

పదవీ నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్

జిల్లావ్యాప్తంగా కేంద్రమంత్రి దిష్టిబొమ్మల దహనం

ఖిలావరంగల్ మండలం పడమరకోట, గీసుగొండ మండలం ఊకలలో అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

ఖిలావరంగల్, డిసెంబర్ 19: రాజ్యసభలో ఈ నెల 18న కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా అంబేద్కర్‌ను అవమానిస్తూ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ ప్రజా సంఘాలు గురువారం నిరసన తెలిపాయి. ఈ మేరకు కోటలో అమిత్‌షా దిష్టబొమ్మను దహనం చేసి బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. అమిత్‌షాను మంత్రి పదవీ నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు రాచర్ల బాలరాజు, పీవైఎల్ రాష్ట్ర కార్యదర్శి ఎలకంటి రాజేందర్, టీఏకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుద్దాల నాగరాజు, జీ దయాకర్, మైదం సంజీవ, పాలకుర్తి సత్యం, బండి కుమారస్వామి పాల్గొన్నారు.

కేంద్రమంత్రి అమిత్‌షా క్షమాపణ చెప్పాలి

రాయపర్తి/గీసుగొండ/నర్సంపేట: అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని కేశవాపురం అంబేద్కర్ సంఘం ప్రతినిధులు చిలుముల కృష్ణ, గుజ సుధాకర్, తాళ్లపల్లి ప్రశాంత్, పెందోట నితీశ్‌కుమార్, మద్దెల రాజు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జీపీ కార్యాలయం ఎదుట ఉన్న అంబేద్కర్ విగ్రహం ఎదుట ఆందోళన చేశారు. అలాగే, అమిత్‌షాను పార్లమెంట్ నుంచి బర్తరఫ్ చేయాలని ఎంసీపీఐ(యూ) కేంద్ర కమిటీ సభ్యుడు గోనె కుమారస్వామి డిమాండ్ చేశారు. గీసుగొండ మండలంలోని ఊకల్ క్రాస్‌రోడ్డులో అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు సంధ్య, సురేశ్, రవి, ఆదినారాయణ, సాయిరాం, లలిత, రాజమౌళి, బీరయ్య, వీరలక్ష్మి పాల్గొన్నారు. అంతేకాకుండా అమిత్‌షాపై కేసు నమోదు చేయాలని బీఆర్ఎస్ నాయకుడు గుర్రం రఘు డిమాండ్ చేశారు. అలాగే, నర్సంపేట నియోజకవర్గ బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో పలువురు నాయకులు అమిత్‌షాపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కార్యక్రమంలో బహుజన సమాజ్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బుర్రి సాగర్, మండల అధ్యక్షుడు తనుగుల రాంచందర్, ఉద్యమకారుల ఐక్యవేదిక నర్సంపేట మండల అధ్యక్షుడు కొర్ర గవర్‌సింగ్ పాల్గొన్నారు. అలాగే, నర్సంపేట మండలంలోని మాదన్నపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంసీపీఐ(యూ) నర్సంపేట డివిజన్ సహాయ కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి మాట్లాడారు. అమిత్‌షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు అనుమాల రమేశ్, కేశెట్టి శ్రీనివాస్, గుర్రం రవి, ఆకుల రాజేందర్, దండు సమ్మయ్య, నర్సయ్య పాల్గొన్నారు.

కేటీఆర్‌పై కేసు రేవంత్ పిరికిపంద చర్య

సూరయ్య

నెక్కొండ, డిసెంబర్ 19: తెలంగాణ ఖ్యాతి ప్రపంచ పటంలో నిలిచేలా హైదరాబాద్‌లో నిర్వహించి ఫార్ములా ఈ-రేస్ నిధుల విషయంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కేసు పెట్టడం సీఎం రేవంత్‌రెడ్డి పిరికిపంద చర్య అని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సంగని సూరయ్య గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. కేటీఆర్, బీఆర్ఎస్ శ్రేణులపై ఎన్ని అక్రమ కేసులు బనాయించినా వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేయకనే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని ఎద్దేవా చేశారు. ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ అసమర్థుల పాలనను ఎండగడతామని స్పష్టం చేశారు.

రాయపర్తిలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

సమగ్ర శిక్షా ఉద్యోగులకు టీచర్ల మద్దతు

రాయపర్తి, డిసెంబర్ 19: ఉద్యోగ భద్రత కోరుతూ 14 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులకు గురువారం మండలకేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో మండలంలోని ప్రభుత్వ ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి మద్దతు ప్రకటించారు. సమగ్ర శిక్షా ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో కేజీవీబీ స్పెషల్ ఆఫీసర్ బుర్ర కవిత, ఉద్యోగులు శైలజ, స్రవంతి, స్నేహలత, రజిని, స్రవంతి, ప్రమీల, విజయ, స్వరూప, వనిత, జ్యోతి, జేరిపోతుల యాకయ్య, అయిత శ్రీనివాస్, వెంకన్న, కిరణ్, రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

'అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు'

అరెస్టయిన నాయకులు

చెన్నారావుపేట/గీసుగొండ, డిసెంబర్ 19: అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని మాల మహానాడు డివిజన్ అధ్యక్షుడు కుమారస్వామి హెచ్చరించారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాల మహానాడు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న మండలంలోని మాల మహానాడు నాయకులు కుమారస్వామి, నరసింగంను గురువారం తెల్లవారుజామున పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన ఉద్యమాన్ని ఎవరూ ఆపలేరని వారు హెచ్చరించారు. అలాగే, గీసుగొండలో జాతీయ మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి నర్సింహస్వామి, నాయకులు శ్రీనివాస్, భిక్షపతి, బాలరాజు, సతీశ్, సారంగం, సంపత్, రాజును సీఐ మహేందర్ ముందస్తుగా అరెస్టు చేశారు.

'ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలి'

వర్ధన్నపేట, డిసెంబర్ 19: సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఎస్సీ వర్గీకరణను రాష్ట్రంలో అమలు చేయాలని తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జన్ను నర్సయ్య కోరారు. గురువారం ఆయన ఆధ్వర్యంలో సంఘం నాయకులు రాష్ట్ర ఎస్సీ వర్గీకరణ ఏక సభ్య కమిషనర్ జస్టిస్ షమీమ్ అక్తర్‌ను హనుమకొండలో కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కంజర్ల మహేశ్, నమిల్ల రవీందర్, జంగిరి భాస్కర్, జిల్లా కనుకయ్య, చినపాక శ్రీనివాస్ పాల్గొన్నారు.

'పంబాల కులస్తులను కేటగిరీ-ఏలో చేర్చాలి'

దుగ్గొండి: ఎస్సీ వర్గీకరణలో భాగంగా పంబాల కులస్తులను ఏ కేటగిరీలో చేర్చాలని పంబాల కుల సంఘం జిల్లా అధ్యక్షుడు రౌతు హరికృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం హనుమకొండలోని కలెక్టరేట్‌లో షమీమ్ అక్తర్‌ను జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రం అందజేశారు. జనాభా ప్రతిపాదికన కాకుండా వెనుకబాటు, సామాజిక, ఆర్థిక స్థితిగతులను పరిశీలించి రిజర్వేషన్ కల్పించాలని కోరారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట సుతి జమిడిక, ఈరకోల, పట్నం పలకతో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు సుద్దల కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి బత్తుల పాండు, గడ్డం రాజయ్య, పల్లెర్ల కమలాకర్, భాస్కర్, బోడ తిరుపతి, మెగ్గం రఘుపతి, గోవర్ధన్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో రైతులకు మేలు

వర్ధన్నపేట, డిసెంబర్ 19: రసాయన ఎరువుల వాడకంతో భూములు నిస్సారమై రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఏరువాక శాస్త్రవేత్త డాక్టర్ సౌమ్య సూచించారు. చంద్రుతండాలో గురువారం కేవీకే ఆధ్వర్యంలో రైతులకు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సేంద్రియ వ్యవసాయంపై ఆమె వివరించారు. విచ్చలవిడిగా రసాయన ఎరువులు వాడడం వల్ల ఉత్పత్తులు విషతుల్యంగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

సంగెం, డిసెంబర్ 19: చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి చెందిన ఘటన మండలంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. చింతలపల్లికి చెందిన వేల్పుల రాజాలు(80) కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కుటుంబానికి భారం కావొద్దనే ఉద్దేశంతో ఈ నెల 17న రాత్రి క్రిమిసంహారక మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఎంజీఎం దవాఖానలో చేర్పించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎల్.నరేశ్ తెలిపారు.

24న అంపశయ్య నవీన్ గ్రంథాల ఆవిష్కరణ సభ

పోచమ్మమైదాన్, డిసెంబర్ 19: ప్రముఖ కవి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అంపశయ్య 84వ జన్మదినం సందర్భంగా ఈ నెల 24న హనుమకొండ నయీంనగర్‌లోని వాగ్దేవి కాలేజీ ఆడిటోరియంలో రెండు గ్రంథాలను ఆవిష్కరించనున్నారు. అలాగే, అంపశయ్య నవీన్ లిటరరీ ట్రస్ట్ ద్వారా 2023, 2024 సంవత్సరాలకు ప్రథమ నవలా పురస్కారాలను ప్రదానం చేయనున్నారు. సాహితీ కార్యక్రమాలకు కవులు, రచయితలు, సాహితీవేత్తలు హాజరు కావాలని నిర్వాహకులు కోరారు.

ప్రభుత్వ పాఠశాలకు బాటిల్ కూలర్ అందజేత

నర్సంపేట, డిసెంబర్ 19: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు గురువారం నర్సంపేటలోని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో బ్యాంక్ అధికారులు బాటిల్ కూలర్ అందజేశారు. బ్యాంక్ ప్రతినిధులు రాజ్‌కుమార్, ఆయూష్ భగత్, హెచ్ఎం రామకృష్ణ, టీచర్లు శంకరయ్య, సురేందర్, కల్పన, ప్రభాకర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాలను ప్రోత్సహించాలి

నెక్కొండ, డిసెంబర్ 19: ప్రభుత్వ దవాఖానల్లోనే ప్రసవాలు చేసుకునేలా గర్భిణులను ప్రోత్సహించాలని జిల్లా మాతాశిశు సంరక్షణ ప్రోగ్రాం అధికారి డాక్టర్ పద్మశ్రీ సూచించారు. నెక్కొండ పీహెచ్‌సీని గురువారం ఆమె సందర్శించారు. ప్రతి నెల గర్భిణుల నమోదు వందశాతం చేయాలన్నారు. ఈడీడీ లైన్ లిస్టులను రెడీగా ఉంచుకోవాలన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి రహీల తన్వీర్, హెల్త్ సూపర్‌వైజర్ వరమ్మ, సిబ్బందికి డాక్టర్ పద్మశ్రీ సూచనలు చేశారు.

వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ పద్మశ్రీ

సూపరింటెండెంట్‌కు వినతిపత్రం ఇస్తున్న జీపీ కార్మికులు

సమ్మెను విజయవంతం చేయాలి

ఖానాపురం, డిసెంబర్ 19: తమ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 27, 28వ తేదీల్లో చేపట్టనున్న సమ్మెను జీపీ కార్మికులు విజయవంతం చేయాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు ఎస్‌కే ఉస్మాన్ పాషా పిలుపునిచ్చారు. గురువారం సమ్మె నోటీసును మండల పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్ వెంకటేశ్వరరెడ్డికి అందజేశారు. పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని, ఎంపీడబ్ల్యూ రద్దు చేయాలని ఉస్మాన్‌పాషా డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీరన్న, భిక్షనాయక్, వెంకటమ్మ, యాకూబ్, సోమక్క, సమ్మక్క పాల్గొన్నారు.

విద్యార్థుల స్థాయికి అనుగుణంగా బోధించాలి

రాయపర్తి, డిసెంబర్ 19: విద్యార్థుల స్థాయికి అనుగుణంగా ఉపాధ్యాయులు విద్యా బోధన చేయాలని పీజీ హెచ్ఎం గారె కృష్ణమూర్తి కోరారు. మండలకేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో ఉపాధ్యాయుల శిక్షణ తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. విద్యార్థులకు చదువుపై ఆసక్తి కలిగించేలా ఉపాధ్యాయులు బోధించాలన్నారు. అభ్యసన సామర్థ్యాలు మెరుగుపడేలా టీచర్లు లోకస్ట్ అండ్ నోకాస్ట్ పద్ధతిలో బోధనోపకరాలను తయారు చేసుకోవాలని సూచించారు. అనంతరం హిందీ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించారు. కార్యక్రమంలో మైలారం హెచ్ఎం అజ్మీరా ఉమాదేవి, ఆర్బీలు వెంకటేశ్వర్‌రావు, రజనీకాంత్, వెంకటరమణ, కె.మహేశ్వర్, గుగులోత్ సునీత, రాజు పాల్గొన్నారు.

ల్యాప్‌టాప్ అందజేస్తున్న ఆర్టీసీ అధికారులు

నిజాయితీ చాటిన ఆర్టీసీ డ్రైవర్

నర్సంపేట, డిసెంబర్ 19: బస్సులో ప్రయాణికుడు మర్చిపోయిన రూ. 90 వేల విలువైన ల్యాప్‌టాప్‌ను అందజేసి ఆర్టీసీ డ్రైవర్ తన నిజాయితీని చాటుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. నర్సంపేట డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బస్సు బుధవారం రాత్రి హైదరాబాద్ ఉప్పల్ రింగ్‌రోడ్డు నుంచి నర్సంపేటకు బయల్దేరింది. హనుమకొండలోని గోపాలపురానికి చెందిన సయ్యద్ ఫరాజుద్దీన్ తన ల్యాప్‌టాప్‌ను బస్సులోనే మర్చిపోయి హనుమకొండ అంబేద్కర్ సర్కిల్‌లో దిగి వెళ్లి పోయాడు. తర్వాత ఫరాజుద్దీన్ డ్రైవర్ సెల్ ఫోన్ నంబర్ తెలుకొని సమాచారం ఇచ్చాడు. టిమ్ డ్రైవర్ బొమ్మినేని మహేందర్‌రెడ్డి ల్యాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకొని నర్సంపేట ఆర్టీసీ డిపో అధికారులకు అందించాడు. అదేరోజు రాత్రి డిపో కంట్రోలర్ జనార్దన్, సెక్యూరిటీ కానిస్టేబుల్ పృథ్వీ సమక్షంలో ప్రయాణికుడికి అందజేశారు. ఈ సందర్భంగా డ్రైవర్‌ను డిపో మేనేజర్ ప్రసూనలక్ష్మి అభినందించారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

పోచమ్మమైదాన్, డిసెంబర్ 19: వరంగల్ ములుగురోడ్డులోని సప్తధామంలో నిర్వహిస్తున్న గురుదేవులు కందుకూరి శివానందమూర్తి జయంతి వేడుకలు గురువారం రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా జిల్లా స్థాయి భగవద్గీత పఠనం శ్లోక పోటీలు నిర్వహించారు. వివిధ కళాశాలల నుంచి వందమందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. ప్రథమ బహుమతి పొందిన వారికి రూ. 5,116, ద్వితీయ బహుమతి రూ. 3,116, తృతీయ బహుమతి రూ. 1,116 నగదు బహుమతులు అందజేసినట్లు శివానంద గురు కల్చరల్ మేనేజింగ్ ట్రస్ట్ త్రిపురనేని గోపీచంద్ తెలిపారు. అలాగే, వారం రోజుల నుంచి ప్రధాన కూడళ్లలో అన్నదానం చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ట్రస్టీలు బండారు సాయి నారాయణ, గందె ఉమాశంకర్, ప్రియాంక, రాంరెడ్డి, వెంకటరమణ, సుబ్రహ్మణ్యం, రాంప్రసాద్, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

'ఎంజేపీ ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి'

ఖానాపురం, డిసెంబర్ 19: ఐనపల్లిలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్ డిమాండ్ చేశారు. గురువారం అదనపు కలెక్టర్ సంధ్యారాణిని హనుమకొండలోని తన చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం నరేశ్ మాట్లాడుతూ ఆదివారం విద్యార్థినులకు ఔటింగ్ ఇచ్చారన్నారు. తల్లిదండ్రులతో కలిసి ఔటింగ్‌కు వెళ్లిన విద్యార్థినుల్లో కొందరు పాఠశాలకు అరగంట ఆలస్యంగా వచ్చారన్నారు. దీంతో ప్రిన్సిపాల్ రెండుగంటలపాటు విద్యార్థినులను లోనికి అనుమతించలేదన్నారు. దీంతో విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు చలిలో తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. అనుచితంగా ప్రవర్తించిన ప్రిన్సిపాల్‌ను వెంటనే విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట శనగరపు రాజేంద్రప్రసాద్ ఉన్నారు.

రైతులు కూడా వినియోగదారులే..

వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి చక్రపాణి

కాంటాలను తనిఖీ చేస్తున్న చక్రపాణి

కాశీబుగ్గ, డిసెంబర్ 19: వినియోగదారుల రక్షణ చట్టం-2019 పరిధిలోకి రైతులు కూడా వస్తారని వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి అన్నారు. వినియోగదారుల హక్కుల వారోత్సవాల్లో భాగంగా వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో గురువారం రెండో రోజు లీగల్ మెటలాజీ రూల్స్-2011, సవరణలపై చైతన్య కార్యక్రమం నిర్వహించారు. మండలి రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో చక్రపాణి మాట్లాడుతూ మార్కెట్ యార్డులోని పీవోఎస్ మిషన్లతోపాటు వ్యవసాయ ఉత్పత్తులు తూకం వేసే కాంటాలు, గ్రేడింగ్ మిషన్, తేమ పరీక్షించే పరికరానికి విధిగా తూనికలు కొలతల శాఖ అధికారులతో స్టాంపింగ్ వేయించుకోవాలని సూచించారు. మార్కెట్ కమిటీ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వినియోగదారుల మండలి రాష్ట్ర అధ్యక్షుడు మొగిలిచర్ల సుదర్శన్, గ్రేడ్-2 కార్యదర్శి అంజిత్‌రావు, అసిస్టెంట్ సెక్రటరీ గంధమల్ల రాజేందర్, సూపర్‌వైజర్ గంటాల గంగాధర్, హైకోర్టు న్యాయవాది మురారి యంశ్వంత్‌కుమార్, మండలి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రావుల రంజిత్‌కుమార్, చిలువేరు ప్రవీణ్ పాల్గొన్నారు. అనంతరం మండలి వారోత్సవాల వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు.

మండలంలో అదనపు కలెక్టర్ పర్యటన

- ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన
- గురుకులంలో వంట నిర్వాహకులపై ఆగ్రహం

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అదనపు కలెక్టర్ సంధ్యారాణి

దుగ్గొండి, డిసెంబర్ 19: అదనపు కలెక్టర్ సంధ్యారాణి గురువారం మండలంలో పర్యటించారు. మైసంపల్లి, దుగ్గొండి, మైసంపల్లి, లక్ష్మీపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. లక్ష్మీపురంలో ధాన్యం విక్రయించి 15 రోజులు గడుస్తున్నా అకౌంట్‌లో డబ్బులు జమ కాకపోవడంతో ఓ రైతు అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాడు. ఈ సందర్భంగా రైతు వివరాలు నమోదు చేయకపోవడంతో కొనుగోలు కేంద్రం నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం తొగర్రాయిలో గుణలోకేశ్వర రైస్‌మిల్‌ను పరిశీలించారు. ట్రక్‌షీట్లు లేకుండా రెండు ట్రాక్టర్లలో వచ్చిన ధాన్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే, మండలంలో ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పరిశీలించారు. అంతేకాకుండా గిర్నిబావిలోని మహాత్మా జ్యోతీబా పూలే గురుకుల పాఠశాలను సందర్శించారు. బుధవారం రాత్రి వండిన క్యాబేజీ కూరను గురువారం మధ్యాహ్నం విద్యార్థులకు వడ్డిస్తుండగా, అదనపు కలెక్టర్ నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బందితో సమీక్షించి సూచనలు చేశారు. విధిగా మెనూ పాటించాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవిచంద్రరెడ్డి, ఎంపీడీవో లెక్కల అరుంధతి, ఎంపీవో శ్రీధర్‌గౌడ్, ప్రిన్సిపాల్ మల్లయ్య, ఆర్ఐ రాంబాబు, కార్యదర్శి కొండల్‌రెడ్డి, టీచర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో ముందు వరుసలో రౌడీషీటర్లు

- నిజమైన కార్యకర్తలకు అన్యాయం
- పార్టీ సీనియర్ నాయకుడు కరాటే ప్రభాకర్

విలేకరులతో మాట్లాడుతున్న ప్రభాకర్

ఖిలావరంగల్, డిసెంబర్ 19: కాంగ్రెస్ పార్టీలో రౌడీషీటర్లే ముందు వరుసలో ఉంటూ నిజమైన కార్యకర్తలకు అన్యాయం చేస్తున్నారని ఆ పార్టీ సీనియర్ నాయకుడు కరాటే ప్రభాకర్ అన్నారు. శివనగర్‌లోని ఆయన నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 30 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ జెండాలు మోసిన నిజమైన కార్యకర్తలకు తూర్పులో తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ కమిటీల్లో ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికే పెద్దపీట వేశారన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పని చేస్తున్న క్రమంలో కొంతమంది రౌడీలతో దాడులు చేయించి, భయభ్రాంతులకు గురిచేసిన వారికి నేడు కమిటీలో చోటు కల్పించడం విచారకరమన్నారు. తూర్పులో నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలకు గుర్తింపు ఇవ్వకుంటే గాంధీభవన్ వద్ద ఆమరణ నిరాహార దీక్ష చేస్తామని హెచ్చరించారు. అలాగే, జెండా మోసిన కార్యకర్తల గురించి అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు మణెమ్మ, అంజమ్మ, సంతోషి, మాధవి, అజీరా, మస్తాన్, స్వరూప, ఉమాదేవి, రమ, వెంకన్న, రమేశ్ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేయాలి

డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట కాంట్రాక్ట్ ఏఎన్ఎంల నిరసన దీక్ష

నిరసన దీక్ష చేస్తున్న కాంట్రాక్ట్ ఏఎన్ఎంలు

గిర్మాజీపేట, డిసెంబర్ 19: జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలో కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్న రెండో ఏఎన్ఎంలు, ఈసీఏఎన్ఎంలు, అర్బన్ హెల్త్‌సెంటర్ ఏఎన్ఎంలు, వైద్య విధాన పరిషత్ ఏఎన్ఎంలు, హెచ్ఆర్డీ ఏఎన్ఎంలను ఎలాంటి రాత పరీక్ష లేకుండా యథావిధిగా రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్